ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 3 నవంబరు 2024



రాజన్న ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు

వేములవాడ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి సామూహిక కార్తీదీపోత్సవం చేపట్టనున్నట్లు, ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హరికథ, 4న కూచిపూడి నృత్యం, 9న భక్తిసంగీతం, 10న కీబోర్డు సోలో, 11న శాస్త్రీయ సంగీత కచేరి, 12న మాధవానంద సరస్వతి స్వామి, తొగుట పీఠాధిపతులు అనుగ్రహ భాషణం, 15న శాస్త్రీయ సంగీత కచేరి, 16న చిందు యక్షగానముల, 17న భక్తి విభావరి, 18,24,25 తేదీల్లో హరికథలు, 29న భక్తివిభావరి, డిసంబరు 1న కూచిపూడి నృత్యం ఉంటాయని పేర్కొన్నారు.

ప్రతీ కుటుంబం వివరాలు సేకరించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- సమగ్ర సర్వేపై సమీక్ష

8



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

నేత్రపర్వంగా కార్తీక దీపోత్సవం

- రాజన్న ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు
- ఆకాశదీపం వెలిగించిన అర్చకులు
- పెద్ద సంఖ్యలో రాజన్నను దర్శించుకున్న భక్తులు

7



కార్తీకదీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో

ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ చూపాలి



విద్యార్థినితో పాఠ్యాంశం చదివిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) శనివారం తనిఖీ చేశారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. పలువురు విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ తదితర అంశాలపై విద్యార్థులు పట్టు సాధించేలా చూడాలని, ప్రతీ రోజు చదివించడం రాయించడం చేయాలని సూచించారు. ఆయన వెంట కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పావని ఉన్నారు.

న్యూస్ బాక్స్

ఏజీపీని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా సబ్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన పసుల కృష్ణను బీఆర్ఎస్ నాయకులు శనివారం సన్మానించారు. మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్ రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, మాజీ ఏఎంసీ చైర్మన్లు అందె సుభాష్, గుల్లపెల్లి నర్సింహారెడ్డి, గుజ్జుల రాజిరెడ్డి, సీనియర్ నాయకులు పిల్లి కిషన్ తదితరులు ఉన్నారు.

విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్

వేములవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ కమిషనర్‌గా అన్వేష్ శనివారం విధుల్లో చేరారు. గ్రూప్స్ కారణంగా ఆయన రెండు మాసాల సెలవుపై వెళ్లగా ఇన్‌చార్జి కమిషనర్‌గా మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి విధులు నిర్వర్తించారు. సెలవులు ముగియడంతో శనివారం అన్వేష్ తిరిగి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు పొడిగించాలి

వేములవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు గడువును పొడిగించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, వేముల వాడ మాజీ సర్పంచ్ పొలాస నరేందర్ కోరారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు ఈ నెల 6వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నదని, ఇప్పటి వరకు చాలా తక్కువ సంఖ్యలో పట్టభద్రులు మాత్రమే ఓటు నమోదు చేసుకున్నారని తెలిపారు. గడువును పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని ఒక ప్రకటనలో కోరారు.

ధాన్యం..దైన్యం



- కొనుగోలు కేంద్రాల్లోనే రాశులు
- నెల రోజులవుతున్నా సేకరించని వైనం
- వర్షానికి తడుస్తున్న వడ్లు
- పూచీకత్తు మెలికతో మిల్లర్లు దూరం
- జిల్లాలో 173 కొనుగోలు కేంద్రాలు
- ప్రారంభంకాని కొనుగోళ్లు
- దళారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అన్నదాతల రెక్కల కష్టం దళారుల పాలవుతోంది. ప్రభుత్వం ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులకుపైగా అవుతున్నా ఒక్క గింజా తూకం వేయలేదు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్నదాతలు ధాన్యం ఆరబోసుకొని పడిగాపులుగాస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కుప్పలు ధన రాశులుగా మారుతాయని ఆశపడ్డ రైతులకు కొనుగోలు నిరీక్షణ తప్పడం లేదు. జిల్లాలో 248 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్న పౌరసరఫరాల శాఖ 173 కేంద్రాలను ప్రారంభించినా ధాన్యం తూకం మాత్రం మొదలు కాలేదు. వానాకాలం సీజన్‌లో రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి 1.80 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు.


ఈ సారి సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతుల్లో మద్దతు ధర కంటే ఎక్కువగా వస్తుందని ఆశపడ్డారు. కానీ సకాలంలో కొనుగోళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు జిల్లాలో 1.80 లక్షల ఎకరాల సాగులో 50 శాతం వరికోతలు పూర్తి చేశారు. సగం వరకు ధాన్యం ఇప్పటికే దళారులకు అమ్ముకున్నారు.

ప్రభుత్వ కేంద్రాలు.. దళారుల కొనుగోళ్లు

జిల్లాలో అన్నదాతలు వానాకాలం సీజన్‌లో పండించిన వరికి 4.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని పౌరసరఫరాల శాఖ అంచనాలు వేసింది. ఇందుకోసం 248 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడమే లక్ష్యంగా 173 కేంద్రాలను ప్రారంభించింది. ఐకేపీ ద్వారా 44 కేంద్రాలకు 42 కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 194 కేంద్రాలకు 121, డీసీఎంఎస్ ద్వారా 6, మెప్మా ద్వారా 4 కేంద్రాలు ప్రారంభించారు. ఎంతో ఆశగా వరి కోతలు ప్రారంభించిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలు పోసుకున్నారు.

పౌరసరఫరాల శాఖ నుంచి కొనుగోళ్లు చేయక పోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకుంటున్నారు. పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యానికి అద్దంపడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే దళారులు లారీలు ఏర్పాటు చేస్తున్నారు. ఏగ్రేడ్ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2320, సాధారణ రకం రూ.2300 ఉంది. దొడ్డు రకం ధాన్యం జిల్లాలో రైతులు ఆరబెట్టినది నేరుగా 2150 వరకు అమ్ముకుంటున్నారు. తడిగా ఉన్న ధాన్యం రూ.1800 నుంచి 1900 వరకు నేరుగా అమ్మేస్తున్నారు.

మిగతా 8వ పేజీలో..



అపెరల్ పార్కు గోదాముల్లో ధాన్యం నిల్వకు చర్యలు



గోదాములను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని అపెరల్ పార్కు గోదాముల్లో నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శనివారం ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం నిల్వ చేసేందుకు అనుకూలంగా ఉన్న అపెరల్ పార్క్ గోదాములను కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యాన్ని భద్రపర్చేందుకు ఇంటర్మీడియెట్ గోదాములను పరిశీలించామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ అపెరల్ పార్కు గోదాములలో 3 లక్షల మెట్రిక్ టన్నులకు పైబడి నిలువ చేసే సామర్థ్యం ఉన్నట్లు పేర్కొన్నారు.

పాన్ ఇండియా సినిమాగా జిగిరి

- పంజాబ్‌లోకి జిగిరి నవల అనువాదం



పంజాబీలోకి అనువదించిన జిగిరి

సిరిసిల్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ జిగిరి నవల ఇప్పటికే 12 భారతీయ భాషల్లోకి అనువాదమైంది. ప్రముఖ చిత్ర సంస్థ ఈ నవలను పాన్ ఇండియా సినిమాగా నిర్మిస్తోంది. తాజాగా మరోసారి పంజాబీలోకి జిగిరి నవలను రచయిత తారాసేన్ అనువదించగా ఢిల్లీ పబ్లిషర్, నవయుగ పబ్లికేషన్, దీపావళి కానుకగా జిగిరి నవలను ప్రచురించారు. పెద్దింటి అశోక్ కుమార్ ప్రస్తుతం చందుర్తి మండలం అశిరెడ్డిపల్లెలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సాహిత్యం, సినీ రంగంలో కృషి చేస్తున్నారు. అనేక అవార్డులను అందుకున్నారు.

తప్పులు లేకుండా వివరాలు సేకరించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులూ లేకుండా సమర్థవంతంగా వివరాలు సేకరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు, కోనరావుపేట మండలం కొలనూర్, ధర్మారంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను పరిశీలించారు. ఎన్యూమరేటర్ బ్లాక్ పరిధిలో పలు ఇళ్ల జాబితా గుర్తింపును పరిశీలించి పలు సూచనలు చేశారు. సమగ్ర సర్వేలో ఇళ్ల జాబితా 3వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా వివరాలు సేకరించాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌డీసీ రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ లావణ్య ఉన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రేషన్ దుకాణాలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు సరుకులు అందించాలని సూచించారు. దుకాణాల్లో సరుకుల నిల్వ, రిజిస్టర్‌లను పరిశీలించారు.



సర్వే వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, మాజీ ఎఎంసీ చైర్మన్‌లు అందె సుభాష్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థలానికి హద్దులు చూపాలి

ఎల్లారెడ్డిపేట నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్‌లోని మైసమ్మ గుట్ట వద్ద ప్రభుత్వ స్థలానికి హద్దులు చూపాలని రైతులు శనివారం తహసీల్దార్ రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ సంతోష్ మైసమ్మ గుట్ట ప్రాంతాన్ని సర్వేయర్‌తో కలిసి పరిశీలించారు. ఇందులో రైతులు శ్రీనివాస్, చంద్రారెడ్డి, భీమయ్య, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువ పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్త్రాలను తయారు చేసేందుకు యువపారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని, రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో ఏర్పాటు చేసిన వీవీంగ్ పార్క్‌ను శనివారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి పరిశీలించారు. అనంతరం యువపారిశ్రామక వేత్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక వస్త్ర పరిశ్రమల ఏర్పాటుతోపాటు నాణ్యత గల వస్త్రాలను తయారు చేయాలన్నారు. అంతకుముందు యువ పారిశ్రామిక వేత్తలు తాము తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ తయారు చేసే వస్త్రాలను పరిశీలించామని వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని, వీవీంగ్ పార్క్‌లో నిర్మించిన షెడ్‌లను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్ రావు, చేనేత జౌళీశాఖ ఏడీ మిట్టకోల సాగర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ పాల్గొన్నారు.



యువపారిశ్రామిక వేత్తలతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

- ఇతరులకు కేటాయించవద్దు

వర్కర్ టు ఓనర్ పథకం కింద నిర్మించిన పరిశ్రమల షెడ్లను ఇతరులకు కేటాయించ వద్దని, వెంటనే పథకాన్ని ప్రారంభించాలని జిల్లా పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ప్రధాన కార్యదర్శి మూషం రమేష్ కోరారు. శనివారం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌శివారులో వీవీంగ్ పార్క్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందించారు. గత ప్రభుత్వం మొదటి విడతగా 1104 మంది కార్మికులను యజమానులుగా మారుస్తామని వీవీంగ్ పార్క్‌లో 46 షెడ్లను, 4వార్పింగ్ షెడ్లను నిర్మించిందన్నారు కానీ లబ్ధిదారులను ఎంపిక చేయకుండా కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. వెంటనే లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ పథకాన్ని ప్రారంభించాలని కోరారు.

ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం



స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

ఇల్లంతకుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల, వెల్జిపూర్ గ్రామాల నుంచి కరీంనగర్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసు సేవలు శనివారం ప్రారంభమయ్యాయి. బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్థులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసు కల్పించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాస్, నాయకులు గుండ వెంకటేశం, నాయిని రమేష్, విజయ్, రాంప్రసాద్‌రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, పర్శరాం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సిరిసిల్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమని, చిన్న ఇబ్బంది కూడా లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు చేస్తోందని, సన్నరకం ధాన్యాన్ని ప్రోత్సహించేందుకు రూ.500 బోనస్ ప్రకటించిందని అన్నారు. జిల్లాలో రైస్‌మిల్లర్లు తాలు పేరుతో కోతలు విధించవద్దని, నాణ్యతా ప్రమాణాలు పరిశీలించిన తరువాతే కొనుగోలు చేయాలని అన్నారు. రైతులకు నష్టం రావడానికి వీలు లేదన్నారు. రైస్‌మిల్లర్లకు ధాన్యం కేటాయింపునకు బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి చేస్తూ జీవో జారీ చేసినట్లు చెప్పారు. మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇవ్వని పరిస్థితుల్లో ధాన్యం భద్రపర్చడానికి ఇంటర్‌మీడియెట్ గోదాములు సన్నద్ధం చేయాలని, గ్రీవెన్స్ సెల్, ఫోన్ నెంబర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. 48 గంటల్లో చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

● జిల్లాలో 175 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని మరో 73 కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంత్రికి వివరించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించామని, అండర్ టేకింగ్ సమర్పించిన తరువాత బ్యాంక్ గ్యారంటీలు సమర్పించాలని సమాచారం ఇచ్చామని తెలిపారు. ఇంటర్మీడియెట్ గోదాములకు అపెరల్ పార్కు వద్ద స్థలం అందుబాటులో ఉందని, ధాన్యం తెచ్చిన వెంటనే కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామని అన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, పౌరసరఫరాల కార్పొరేషన్ డీఎం రజిత, డీఎస్‌వో వసంత లక్ష్మి, డీసీవో రామకృష్ణ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు మణిదీప్ ఎంపిక


మణిదీప్‌ను అభినందిస్తున్న హెచ్ఎం

మెట్‌పల్లి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి మణిదీప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జితేందర్ శనివారం తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి అండర్ 14 కరాటే పోటీలో మణిదీప్ ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడని తెలిపారు. అండర్-20 ఖోఖో పోటీల్లో కాశవేని దేవిశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

యువతిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వివాహం చేసుకుంటానని చెప్పి మోసం చేయడంతోపాటు దాడి చేసి ఇబ్బందులకు గురిచేసిన ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వన్‌టౌన్ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని గోదాంగడ్డకు చెం దిన రమేష్, ఒక యువతి సహజీవనం చేశారు. వారి మధ్య విభేదాలు రావడంతో విడిగా ఉంటున్నారు. ఇటీవల రమేష్ ఆ యువతితో గొడవ పడి దాడి చేశాడు. యువతి ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సేవా గుణం.. స్ఫూర్తిదాయకం

ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతూ స్ఫూర్తినిచ్చేవారు అరుదుగా కనిపిస్తారు. తమ ప్రాంతానికి సేవ చేస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చింతోజు భాస్కర్ మానేరు సంస్థల ద్వారా ఆ జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి తమ ప్రాంతంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మోటారు మెకానిక్ నుంచి సేవా రంగంలోకి..

- మానేరు సంస్థ ద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చింతోజు భాస్కర్

సిరిసిల్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన చింతోజు భాస్కర్‌ను పేదరికం చిన్ననాడే పనివైపు పరుగులు పెట్టించింది. సిరిసిల్లలో మోటారు మెకానిక్‌గా గుర్తింపు తెచ్చుకున్న భాస్కర్ డీలర్‌గా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు.



అబ్దుల్ కలాం అవార్డును అందుకుంటున్న భాస్కర్


చింతోజు భాస్కర్

ఆర్థికంగా ఎదుగుతూ మరికొందరికి ఉపాధి కల్పిస్తూనే స్వచ్ఛంద సేవలో తనదైన ముద్ర వేసుకున్నారు. మానేరు స్వచ్ఛంద సంస్థను స్థాపించి సేవా కార్యాక్రమాలను విస్తరించారు. జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. లాక్‌డౌన్ వంటి విపత్కర పరిస్థితుల్లో అన్నదానం, నిత్యావసర సరుకుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. సిరిసిల్లలో కార్మికుల వరుస ఆత్మహత్యల నివారణ కోసం మనోధైర్య శిబిరాలను నిర్వహించారు. పలు అవార్డులు, పురస్కారాలను పొందారు. లోక్ అదాలత్ సభ్యుడిగా, ప్రభుత్వ పరంగా పలు కమిటీల్లోనూ పని చేస్తున్నారు. సినీనటుడు సంపూర్ణేష్‌బాబుతో కలిసి కొబ్బరిమట్ట, బజారురౌడీ తదితర సినిమాల్లో నటించారు. పలు సినీ ప్రముఖులతో టీవీ షోల్లో పాల్గొన్నారు. న్యాయ సేవలను పొందడానికి ప్రజల్లో అవగాహనను పెంపొందించే దిశగా సినిమాను రూపొందిస్తున్నారు

పూర్వ విద్యార్థులు కలిసి.. ట్రస్ట్‌గా ఏర్పడి

- సేవలు అందిస్తున్న శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్

పెగడపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సేవ చేయాలనే గుణం ఉంటే లక్షాధికారులో, కోటీశ్వరులో కానక్కరలేదు.. మంచి మనసుండి చేయాలనే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు నంచర్ల శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు. పెగడపల్లి మండలంలోని నంచర్ల కేంద్రంగా నంచర్ల, రాములపల్లి, దీకొండ గ్రామాలకు చెందిన నంచర్ల పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 22 మంది కలిసి 2018లో శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. ముందుగా తమ గ్రామాల్లో సేవలు అందజేసి ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా విస్తరింపజేశారు. ఆపద సమయంలో


క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడి వైద్యానికి రూ. 75 వేలు ఆర్థిక సాయమందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అందరి సహకారంతో సేవా కార్యక్రమాలు

- చేపూరి మల్లేశ్‌గౌడ్, మేనేజింగ్ ట్రస్టీ



మాతృభూమికి కొంతైనా చేయాలన్న సంకల్పంతో శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించాం. ట్రస్టు సభ్యులే కాకుండా దాతలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకారంతో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మూడు గ్రామాలకే కాకుండా మండలం, చుట్టు పక్కల గ్రామాలకు కూడా ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అందిస్తున్నాం.

దాతల సహకారంతో మరిన్ని సేవలకు కృషి

- లింగంపల్లి లచ్చయ్య, కోశాధికారి



నంచర్ల పాఠశాలలో చదువుకున్న మేము పాఠశాలకు, గ్రామానికి ఏదైనా చేయాలనే సంకల్పంతో ట్రస్ట్ ప్రారంభించాం. విద్యా, వైద్యం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మరిన్ని సేవలు అందించాలనే దిశగా ముందుకు సాగుతున్నాం.

ఆస్పత్రికి వెళ్లేందుకు ఆరు లక్షలు వెచ్చించి అంబులెన్స్ ఏర్పాటు చేశారు. దాత ఒకరు వైకుంటరథం ఇస్తే ట్రస్ట్ తరుపున డ్రైవరు, డీజిల్ ఖర్చులు చెల్లిస్తున్నారు. మూడు గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి వార్తా పత్రికలతోపాటు యువతకు అవసరమయ్యే పుస్తకాల అందుబాటులో ఉంచుతున్నారు. ఇలా పలు సేవలు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

భగత్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు ఎంపికయ్యారు. వరంగల్ జిల్లాలో అక్టోబరు 28 నుంచి 30 వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17లో 81 కేజీల విభాగంలో బి అబిలాష్ రజత పతకం, అండర్-14లో 23 కేజీల విభాగంలో ఎం లహరి రజత పతకం కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎం పికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు వెంకటపద్మాదేవి, పీడీ ఎల్ వెంకటరమణ, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అభినందించారు.

అంతర్‌జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపిక


ఎంపికైన 'ఆదర్శ' విద్యార్థులు

గొల్లపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ మినీ స్టేడియంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ పోటీల్లో గొల్లపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చారు. ఎస్‌జీఎఫ్ ఇంటర్నెట్ చెస్ పోటీల్లో జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభను కనబర్చి అంతర్‌జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదర్శ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న దేవి శ్రీహర్షిణి, ఎనిమిదవ తరగతి చదువుతున్న దేవి మహర్షి హర్షిత్ అనే ఇద్దరు విద్యార్థులు చెస్ పోటీల్లో జిల్లా స్థాయిలో మెరిసి అంతర్‌జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరు సొంత అక్కాతమ్ముడు కావడం విశేషం. అంతర్‌జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన అక్కాతమ్ముడిని ప్రిన్సిపాల్ సుంకరి రవి, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, పీడీ రజిత, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగులకు త్వరలో యోగా శిక్షణ

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఉత్సాహంగా జిల్లా స్థాయి యోగా పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యో తి): జిల్లాలోని ఉద్యోగస్తులకు ప్రత్యేకంగా యోగా శిక్షణను నూతన సంవత్సరం నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శనివారం జిల్లా యువజన, క్రీడాశాఖ, యోగా అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఆహ్వానిత యోగాసన పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ తనకు యోగా అంటే చాలా ఇష్టమన్నారు. అవకాశం ఉంటే క్రీడాకారిణి గా, కనీసం జట్టుకు మేనేజర్‌గానైనా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని ఉందన్నారు. పాఠ శాలలు, ఇళ్లలో పిల్లలు కేవలం ధ్యానానికే పరిమి తం కాకూడదని, యోగాతో ప్రతిభను సొంతం చేసుకోవాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన యోగాసనాలు చూస్తే గర్వంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన దీపక్‌కు స్వర్ణ పతకం సాధించడం అభినందనీయమన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నవ్వడం కూడా యోగా లో ఒక భాగమని తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ కరోనా సమయంలో యోగా చేయడం వలన చాలామం ది ఆరోగ్యాన్ని పరిరక్షించుకున్నారని అన్నారు. జిల్లా యోగా అసోసియేష న్ అధ్యక్షుడు సర్దార్ రవీందర్‌సింగ్ మాట్లాడు తూ జిల్లాలో యోగా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్వర్ణ పతక విజేత దీపక్‌ను, కోచ్ రామకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి సుధాకర్, జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ కుమార్ నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ రాంబాబు, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎస్ సిద్దారెడ్డి, తెలంగాణ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి జనార్దన్‌రెడ్డి, తహసిల్దార్ కాళీచరణ్‌గౌడ్, జిల్లా ఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్య క్షుడు హర్మిందర్‌సింగ్, కోచ్‌లు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 300 మం ది క్రీడాకారులు వివిధ వయ స్సు విభాగాల్లో పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆహూతు లను ఆకట్టుకున్నా యి. అనంతరం విజేతలకు కలెక్టర్ జ్ఞాపికతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.



యోగాసన పోటీలను తిలకిస్తున్న కలెక్టర్, అతిథులు, యోగాసనం వేస్తున్న కలెక్టర్ తల్లి ప్రవమయి ఆచార్య


యోగాసనాలు వేస్తున్న బాలికలు

- యోగాసనాలు వేసిన కలెక్టర్ తల్లి

కలెక్టర్ మాతృమూర్తి ప్రవమయి ఆచార్య యోగాపై ఉన్న మక్కువతో పోటీలో పాల్గొని రజత పతకాన్ని సాధించింది. అనంతరం తన కూతురు, కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంది. ఇది తమ జీవితంలో మరపురాని ఘట్టమని వారు వ్యాఖ్యానించారు.

వివాహిత ఆత్మహత్య

ముత్తారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అమరాబాద్‌కు చెందిన బిస్కుల సమత(21)అనే వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు, ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాల్‌పల్లి జిల్లా మల్హర్‌రావు మండలం మల్లారం గ్రామానికి చెందిన సమత ముత్తారం మండలంలోని అమరాబాద్‌కు చెందిన బిస్కుల సంతోష్‌ను రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. రెండేళ్లుగా సంతోష్ వరకట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండడంతో శుక్రవారం పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు మొదట కరీంనగర్‌కు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. తన కూతురు మరణానికి అల్లుడు బిస్కుల సంతోష్ కారణమని మృతురాలి తల్లి చేద లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మృతురాలికి పది నెలల కొడుకు ఉన్నాడు.

మనస్తాపంతో యువకుడు..

ముత్తారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైదంబండ గ్రామానికి చెందిన బియ్యని అజయ్(24) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... అజయ్ ప్రేమించిన అమ్మాయికి వేరే పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలిసి మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు అజయ్ తండ్రి మొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

వరద కాలువలో దూకి వృద్ధురాలు..

కథలాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్‌పల్లికి చెందిన సుంకరి బుచ్చమ్మ (80) అనే వృద్ధురాలు వరద కాలువలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. బుచ్చమ్మ కొంతకాలంగా కడుపునొప్పి, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన బుచ్చమ్మ మళ్లీ తిరిగి రాలేదు. సమీపంలో ఉన్న పెగ్గెర్ల వరద కాలువలో శనివారం శవమై కనిపించింది. కడుపునొప్పి తీవ్రం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని తెలిపారు. మృతురాలి మేనల్లుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

వీర్నపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో శనివారం బైక్ అదుపుతప్పి కింద పడడంతో గ్రామానికి చెందిన ఈసంపల్లి ఆశిష్ అనే యువకుడు గాయపడ్డాడు. ఆశిష్ తన స్నేహితులను కలిసేందుకు మండల కేంద్రానికి వెళ్తుండగా వడ్డెర కాలనీ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. దీంతో తలకు, వెన్నుపూస భాగంలో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

ముస్తాఫనగర్‌లో ఇల్లు దగ్ధం

గంభీరావుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో శివంది రమేష్ ఇంట్లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇంటి నిర్మాణం కోసం అప్పుగా తెచ్చుకున్న లక్షా 20 వేలు నగదు కాలిపోయింది. బట్టలు, పత్రాలు, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. ప్రమాద స్థలాన్ని రెవెన్యూ అధికారులు, పోలీస్‌లు పరిశీలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో వాహన తనిఖీల్లో శనివారం మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. పోలీసులు రెడ్డిపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఆటోను తనిఖీ చేయగా మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. రేషన్ బియ్యం తరలిస్తున్న మోటం గణేశ్, నంబయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని కిలోకు 12 రూపాయలు చెల్లిస్తూ కొనుగోలు చేసున్నారని పోలీసులు చెప్పారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని సుల్తానాబాద్ పరిధిలో ఉన్న కోళ్ల ఫాంలో అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారని ఎస్సై తోట తిరుపతి చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన కలప పట్టివేత


పట్టుకున్న కలపతో అధికారులు

చందుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన కలపను పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు సీసీఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు శనివారం తెలిపారు. మండలంలోని లింగంపేట గ్రామ శివారులోని పోలీస్ అమరవీరుల స్థూపం వెనుక భాగంలో టేకు కలపను డంపు చేసినట్లు సమాచారం అందిందన్నారు. అక్కడికి వెళ్లి పరిశీలించగా ఎనిమిది టేకు దుంగలు లభ్యం అయ్యామని, వాటిని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ విషయమై బీట్ ఆఫీసర్ బాలకృష్ణ మాట్లాడుతూ పట్టుకున్న కలపను ఎల్లారెడ్డికి తరలించనున్నట్లు తెలిపారు. కలప విలువ దాదాపు ఆరు వేల వరకు ఉంటుందని వివరించారు.

మంచు కురిసే వేళలో..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పొగమంచు దట్టంగా వ్యాపించింది. శనివారం తెల్లవారు జాము నుంచి ఉదయం ఏడు గంటల వరకు దట్టమైన పొగ మంచు ఆవరించింది. పాదాచారులు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఏమీ కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం చేశారు.

- పెద్దపల్లి/జగిత్యాల అర్బన్/వెల్గటూర్/ఎండప ల్లి/రుద్రంగి



పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద పొగ మంచు


జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో..


రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో..


జగిత్యాల పట్టణంలో

చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలిగా దీపారాణి



కోరుట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణానికి చెందిన జిల్లా దీపారాణి చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళ విభాగం ఉపాధ్యక్షురాలిగా నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్ శనివారం ప్రకటించినట్లు పద్మశాలి సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా దీపారాణి మాట్లాడుతూ పద్మశాలి సంక్షేమానికి, చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకారం అందించిన రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్, పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, పట్ట ణ అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, సంఘ సభ్యులు వాసం భూమానందం, సంఘసభ్యులకు దీపారాణి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

హుజూరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాల బాలికల కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. బాలికల విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో సిరిసిల్ల జట్టు నిలిచింది. బాలుర విభాగంలో మొదటి స్థానం సిరిసిల్ల, ద్వితీయ స్థానంలో కరీంనగర్ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎంఈవో శ్రీనివాస్, శ్రీనివాస్, హెచ్ఎం తిరుమల, వేణుమాధవ్, రాజేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్, రవికుమార్, అనిల్, సొల్లు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ సర్టిఫికెట్ కోర్సు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నవంబరు 15వ తేదీ లోగా దరఖాస్తులు కళాశాల తెలుగు విభాగం కన్వీనర్ డాక్టర్ బుర్ర చంద్రశేఖర్‌గౌడ్‌కు సమర్పించాలని కోరారు.

బోధన్-సిర్‌పూర్ కాగజ్‌నగర్ రైలు పునరుద్ధరణ

కరీంనగర్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి కరీంనగర్ మీదుగా సిర్‌పూర్ కాగజ్‌నగర్ వరకు ప్రత్యేక రైలును శుక్రవారం నుంచి అధికారులు పునరుద్ధరించారు. గతంలో కరోనా సమయంలో రైలును నిలిపివేశారు. ప్రతి రోజు ఉదయం 4.15 గంటలకు బోధన్ నుంచి బయలుదేరి కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు 7.55 గంటలకు చేరుకుంటుంది. సిర్‌పూర్ కాగజ్‌నగర్‌కు 11.55 గంటలకు చేరుకుంటుంది. తిరిగి సిర్‌పూర్ కాగజ్‌నగర్ నుంచి బయలుదేరి కరీంనగర్‌కు మధ్యాహ్నం 2.35 గంటలకు చేరుకుంటుంది. బోధన్ రైల్వేస్టేషన్‌కు సాయంత్రం 6.15 గంటలకు చేరుకుంటుంది.

రాజన్నను దర్శించుకున్న టీఎస్‌సీపీసీఆర్ చైర్మన్

వేములవాడ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర స్టేట్ కమిషనర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (టీఎస్‌సీపీసీఆర్) చైర్మన్ శ్రీనివాస్‌రావు శనివారం దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు ఆశీర్వదించగా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు ప్రసాదాన్ని అందజేశారు.



టీఎస్‌సీపీసీఆర్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆలయ అధికారులు

కూరగాయల సాగులో అతివలు



వంకాయ తోటలో కలుపు తీస్తున్న మహిళలు



సాగులో ఉన్న దొండ తోట

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- స్వయంగా మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మకాలు

కూరగాయల సాగులో మహిళలు రాణిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేస్తూ అధిక దిగు బడులు సాధిస్తున్నారు. సేంద్రియ ఎరువులను తయా రు చేసుకుంటూ పంటలకు వాడుతున్నారు. పండిన కూరగాయాలను వారే మార్కెట్‌కు తరలించి అమ్ము తున్నారు. దీంతో దళారుల బెడద తగ్గింది. లాభ మైనా.. నష్టమైనా తామే భరిస్తున్నారు. సీజన్‌కు అను గుణంగా డిమాండ్ ఉన్న కూరగాయలు సాగు చేస్తున్నారు.



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న కాలిఫ్లవర్

కోరుట్ల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలంలోని సర్పరాజ్‌పూర్, ఎఖీన్‌పూర్, అయిలాపూర్, నాగులపేట, వెంకటాపూర్ గ్రామాల



క్యాబేజీ తోటకు నీరు అందిస్తున్న మహిళా రైతు

మహిళలు అధిక మొత్తంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. అన్ని రకాల కూరగాయలు పండిస్తూ స్థానిక పట్టణాలకు తీసుకెళ్లి తామే విక్రయిస్తున్నారు. డిమాండ్‌కు, సీజన్‌కు అనుగుణంగా వీరు కూరగా యలు, ఆకు కూరలు సాగు చేస్తారు. ప్రధానంగా కాలిఫ్లవర్, క్యాబేజీ, టమాట, తోటకూర, పాలకూర, చుక్కకూర, వంకాయ, దోస, గోరుచిక్కుడు తదితర పంటలను పండిస్తున్నారు. కూరగాయలను రసాయన ఎరువులతో కాకుండా తాము తయారు చేసుకున్న ఎరువులు వేసి సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు. వీరు పండించిన పంటలను కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల వంటి పట్టణాలకు తరలించి మార్కెట్లలో విక్రయిస్తుంటారు. ప్రభుత్వం సహకరిస్తే మరింత సాగు చేస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదు. కూరగాయల విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు. పండించిన కూరగాయలను విక్రయించుకోవడానికి ఆయా పట్టణాల్లో తమకు ప్రత్యేక స్థలాలను కేటాయించాలని వారు కోరుతున్నారు.

దిగుబడులు బాగున్నాయి..

- తోట లక్ష్మి, మహిళా రైతు, సర్పరాజ్‌పూర్



మాకున్న 10 గుంటల వ్యవసాయ భూమిలో క్యాలిఫ్లవర్, క్యాబేజీ, తోటకూర సాగు చేస్తున్నాము. చేతికొచ్చిన కూరగాయలను స్థానిక పట్టణాల్లో విక్రయిస్తున్నాము. ప్రజలు కూడా తాజా కూరగాయలను కొనడానికి ఆసక్తి చూపుతున్నారు.

తాజా కూరగాయలకు గిరాకీ ఉంది..

జవిడి ప్రమీల, మహిళా రైతు, (నాగులపేట)



తాజా కూరగాయలకు మార్కెట్‌లో గిరాకీ బాగుంది. మేము ఏ రోజు తెంపిన కూరగాయలను ఆ రోజు మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతాం. సేంద్రియ పద్ధతిలో పండిస్తుండడంతో ఆదరణ బాగుంది.



సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న మహిళా రైతు

● సేంద్రియ ఎరువుల తయారీ

గేదే, ఆవు, మేక పేడతోపాటు కుళ్లిపోయిన పండ్లు, కూరగాయలను సేకరించి సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నారు. అవసరం ఉన్న సమయంలో ఎరువులు వాడతారు. అవసరం ఉన్న సమయంలో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకుంటారు. కూరగాయలతోపాటు తోటల గట్లపై చామంతి, బంతి పూలు సాగు చేస్తారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే అభివృద్ధి

- ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆపై ప్రజా సేవకులం
- కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- మల్యాల-కాచారం రహదారి పనులను ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించిన బండి



గజమాలతో స్వాగతం పలుకుతున్న బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు

మల్యాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధి సాధ్యపడుతుందని ఎన్నికల వరకే రాజకీయాలు చేస్తూ ఎన్నికల తరువాత ప్రజా సేవకులుగా అభివృద్ధికి ముందుకు వెళదామని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మల్యాల మండలం మల్యాల క్రాస్ రోడ్డు నుంచి మేడిపల్లి మండలం కాచారం వరకు 11.7కిమీ మేర కేంద్ర ప్రభుత్వ సీఆర్ఐఎఫ్ నిధులు రూ.25కోట్లతో చేపట్టిన డబుల్‌రోడ్డు విస్తరణ పనులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని కేంద్రం నిధులు ఇచ్చినా రాష్ట్రం, కేంద్రం కలిసి చేసుకోవల్సిన అభివృద్ధి అని ప్రస్తుతం ఇది కొనసాగిద్దామన్నారు. గత ప్రభుత్వ పాలనలో కేంద్ర ప్రభుత్వానికి సహకరించకుండా ప్రొటోకాల్ పాటించలేదని విమర్శించారు. కేంద్రం మంజూరు చేసిన నిధులను దారి మళ్లించడమే కాకుండా పేరు ప్రఖ్యాతల కోసం అధికారులపై ఒత్తిడి చేసిందన్నారు. చాలారోజుల తరువాత మల్యాలలో పార్టీల మధ్య ప్రొటోకాల్ పాటించడం కనిపించిందని ఇది మంచి సంప్రదాయమని కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు కలిసి అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని ఇక ముందు ఈ ఆనవాయితీని కొనసాగిద్దామన్నారు. కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణకు అందులోనూ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గానికి అత్యధికంగా సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేశారని సంజయ్ తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని ప్రస్తుత రహదారి పనుల ప్రారంభ విషయంలో ఎమ్మెల్యే సహకారం ఎంతగానో ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పరం సహకారం అవసరమని, గత రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి బండి సంజయ్ నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బొడిగే శోభ, సుద్దాల దేవయ్య, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు

● కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం..

రహదారి విస్తరణ పనుల కోసం వచ్చిన బండి సంజయ్, మేడిపల్లి సత్యంకు బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. వేర్వేరు పార్టీలు అయినప్పటికీ పరస్పరం కలిసికట్టుగా మల్యాల క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభ స్థలం వరకు పాదయాత్రగా రాగ ఆయా పార్టీల శ్రేణులు, ప్రజలు పూలు చల్లుతూ తీసుకువచ్చారు. ప్రొటోకాల్ ప్రకారం పెద్ద ఎత్తున రెండు పార్టీల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సంతోషం వ్యక్తం చేశారు. ఇక ముందు కూడా ఆలాగే ముందుకు వెళదామని పేర్కొన్నారు. రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కూడా కార్యక్రమానికి వస్తారని కాంగ్రెస్ నాయకులు పేర్కొనగా హాజరుకాలేదు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కార్యకర్తలతో చాయ్ తాగుతూ..ముచ్చటిస్తూ

కేంద్ర మంత్రి బండి సంజయ్ రహదారి పనుల శిలాఫలకం ఆవిష్కరణ తరువాత తనను కలవడానికి వచ్చిన కార్యకర్తలతో కొంత సేపు సరదాగా గడిపారు. అనంతరం కొండగట్టులో అల్పాహారం చేసి పార్టీ కార్యకర్తలతో కలిసి ముచ్చటిస్తూ టీ తాగారు. బండి సంజయ్‌ను కలవడానికి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలిరాగా ఆయన ముందుకు కదలలేని పరిస్థితి నెలకొన్నది. పోలీసులు వారందరినీ అక్కడి నుంచి పంపించే ప్రయత్నాలు చేశారు. దీంతో బీజేపీ నాయకులు కొందరు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుడిని కలవనీయరా.. సమస్యలు చెప్పుకో నియ్యరా అంటూ మండిపడ్డారు.

● కాగా రహదారి పనుల ప్రారంభానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంలో నూకపల్లికి బదులు మల్యాల గ్రామంగా పేర్కొనడంతో నూకపల్లి వాసులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరు మార్చాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బంజేరులో కంపోస్ట్ షెడ్డుని పరిశీలిస్తున్న నేషనల్ టీం సభ్యులు

వీర్నపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలంద రూ సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం లీడర్ ఎస్పీ సునీల్‌కుమార్, సభ్యులు స్నేహ నజీబ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు బంజేరులో ఉపాధిహామీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, నేషనల్ సోషల్ అసిస్టెంట్ ప్రోగ్రాం, నేషనల్ రూరల్ లైవ్ లీ వుడ్ కార్యక్రమానికి సంబంధించిన పనులను శనివారం పరిశీలించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేస్తున్న పనుల పనితీరు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు.

వీర్నపల్లి మండలం బంజేరులో గ్రామపంచా యతీ రికార్డుల మెయింటెనెన్స్, అభివృద్ధి పనుల్లో పంచాయతీ కార్యదర్శి రణధీర్ పనితీరు బాగుందన్నారు. అంతకుముందు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమం లో ఏపీడీ నర్సింహులు, సాంకేతిక సలహాదారులు అర్షద్ పాషా, ఎంపీడీవో రఘురాం, ఏపీవో శ్రీహరి, టెక్నికల్ అసిస్టెంట్ అనిత, గంగాధర్, ఐకేపీ డీపీఎం పద్మయ్య, ఏపీఎం నర్సయ్య, సీసీలు శ్యామల, రాధ పంచాయతీ కార్యదర్శులు రణధీర్, తిరుపతి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు అధికారిపై కుక్కదాడి

వేములవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, కులగణన సర్వే విధుల్లో ఉన్న వార్డు అధికారిపై కుక్క దాడి చేసిన ఘటన శనివారం నాడు వేములవాడ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక రామ్ మందిర్ వీధిలోని ఓ ఇంటికి సర్వే కోసం వెళ్లిన మున్సిపల్ వార్డు అధికారి ఆంజనేయులుపై అక్కడున్న కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో కాలుకు గాయమైన అంజనేయులును ఏరియా ఆసుపత్రి తరలించి చికిత్స అందించారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

వీర్నపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో లచ్చయ్య శనివారం తెలిపారు. వీర్నపల్లి మండలం జవహర్ లాల్ నాయక్ తండాకు చెందిన అజ్మీరా తరుణ్ అనే యువకుడు వరికోత మిషన్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అజ్మీరా సాగర్‌తో పలు విషయాల్లో గతం నుంచి తరుణ్‌కు విభేదాలు ఉన్నాయి. దానిని దృష్టిలో ఉంచుకొని సాగర్ అతడి స్నేహితులు దేవేందర్, రవి, శ్రీహరి వరికోత మిషన్ నడుపుతున్న తరుణ్‌ను మిషన్‌పై నుంచి దించి తీవ్రంగా గాయపర్చారు. గాయప డిన తరుణ్‌ను స్థానికులు అసుపత్రికి తరలించారు. బాధితుడు తరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్ట నట్లు ఎస్‌హెచ్‌వో లచ్చయ్య తెలిపారు.

వైభవంగా కార్తీక మాసోత్సవాలు ప్రారంభం



నదిలో దీపాలు వదులుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



రాజన్న ఆలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

గోదావరి నది వద్ద గంగా హారతి

ధర్మపురి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. కార్తీక మాసం పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు క్షేత్రానికి చేరుకున్నారు. ఏటా నిర్వహించే విధంగా ధర్మపురి గోదావరి నది వద్ద సాయంత్రం గంగా హారతి ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆరంభం నుంచి 15 రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు సిబ్బంది ఊరేగింపుగా గోదావరి నదికి వెళ్లారు. అనంతరం నది వద్ద శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి వరకు గంగా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 15 రోజుల పాటు పౌర్ణమి వరకు నిత్యం సాయంత్రం వేళలో నిర్వహిస్తారు. గంగా హారతి కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచార్యా, నంబి నరసింహమూర్తి పాల్గొన్నారు.

● భక్తుల రద్దీ..

ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం వరకు క్షేత్రానికి వేలాది మంది భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. అనేక మంది మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించారు. రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు అంజనేయ స్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్యఅర్చకులు నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ నేతృ త్వంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

కొండగట్టులో కార్తీక దీపారాధన

మల్యాల (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో కార్తీకమాసం పురస్కరించుకొని దీపారాధన నిర్వహించారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి అభిషేక మండపంలో దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా డోలు వాయిద్యకారుడు నీలకంఠం స్వామి వారి భజన చేశారు. ఈవో రామకృష్ణరావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, ఆలయ అర్చకులు, వేదపాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు

● వేములవాడలో ఆకట్టుకున్న కార్తీక దీపోత్సవం

వేములవాడ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): ఆదిదంపతులకు ఎంతో ప్రీతికరమైన కార్తీకమాసంను పురష్కరించుకుని వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో వెలిగించిన కార్తీకదీపోత్సవం నేత్రపర్వంగా ఆకట్టుకుంది. కార్తీకమాసం మొదటి రోజు కావడంతో ఆలయంలో ఈవో వినోద్‌రెడ్డి కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాజన్న ఆలయానికి వీచ్చేసిన భక్తులు ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవం కార్యక్రమాల్లో పాల్గొని ఆధ్యాత్మికత ఉట్టిపడేలా దీపాలను వెలిగించారు. ఓం, ఓం నమఃశివాయ, స్వస్తిక్ రూపాల్లో భక్తులు వెలిగించిన దీపాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శనివారం ఉదయం నుంచే భక్తులు రాజన్న ఆలయంలో కార్తీక దీపాలను వెలిగించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో రాజన్న ఆలయ ప్రాంగాణం దీపాలకాంతుల్లో దేదిప్యమానంగా వెలుగొందింది.



కొండగట్టులో..

● ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో అర్చకులు వేదమంత్రాలతో వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గండదీపంలో ఆకాశదీపాన్ని ఆలయ అర్చకులు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నమిలికొండ రాజేశ్వర శర్మ, ఆలయ అర్చకులు, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు ఉన్నారు.

న్యూస్ బాక్స్

పాఠశాల పనుల పరిశీలన

ఎల్లారెడ్డిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ ప్రాథమిక పాఠశాలకు స్కూల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ. 5 లక్షలతో నిర్మిస్తున్న పనులను మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం శనివారం పరిశీలించారు. అనంతరం సబేరా బేగంను పాఠశాల యాజమాన్య కమిటీ సన్మానించింది. ఏఎంసీ చైర్మన్ తాళ్లపల్లి భాగ్యమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మాజీ సర్పంచ్ నిమ్మ లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మహేందర్, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్ పాల్గొన్నారు.

7న హమాలీల ధర్నా

తంగళ్లపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 7న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పంతం రవి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో హమాలీ సంఘం నాయకులతో కలిసి ధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హమాలీ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణు, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సోమ నాగరాజు, హమాలి కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పట్ట భద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఇల్లంతకుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు ఈ నెల 6తో ముగియనుందని, ఫామ్ 18 ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. అత్యధిక మంది ఓటుహక్కును వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుందని పేర్కొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

తంగళ్లపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన శ్యాగా రాంచరణ్ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. నిమ్స్ అనుపత్రి వైద్యులు అత్యవసర చికిత్స చేయాలని చెప్పడంతో చిన్నలింగాపూర్ మాజీ ఎంపీటీసీ బైరినేని రాము వెంటనే వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆది శ్రీనివాస్ నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చించి ప్రత్యేక చికిత్స అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు రూ.1.50 లక్షలు మంజూరు చేయించారు. ఎల్‌వోసీ మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రాంచరణ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం.. దైన్యం

(5వ పేజీ తరువాయి)

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి, నెలల తరబడి ఎదురు చూడడం, వర్షం వస్తే వడ్లు వరద పాలు కావడం వంటిసమస్యలను దృష్టిలో పెట్టుకొని రైతులు మధ్య దళారులు లేదా నేరుగా మిల్లర్లకే అమ్ముకుంటున్నారు.

పూచీకత్తుల మెలికతో ముందుకురాని మిల్లర్లు

ప్రభుత్వం రైస్‌మిల్లర్లకు సీఎంఆర్ కింద ధాన్యం కేటాయింపులో బ్యాంక్ గ్యారంటీ, పెట్టడంతో మిల్లర్లు ముందుకు రావడం లేదు. దీంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 107 రైస్ మిల్లుల వరకు ఉన్నాయి. ఇందులో 73 మిల్లుల వరకు డీఫాల్ట్‌గా ఉన్నాయి. వీటిలో 10 నుంచి 25 శాతం వరకు బ్యాంక్ గ్యారంటీ మిల్లుల నంచి ఇవ్వాల్సిన పరిస్థితి. దీంతో మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇవ్వలేమని నిరసన వ్యక్తం చేశారు. వానాకాలంలో పచ్చి బియ్యం 67 కిలోలు, యాసంగిలో బాయిల్డ్ రైస్ 68 కిలోల చొప్పున ప్రభుత్వానికి అందించాలి. దీని ద్వారా నష్టపోతున్నామని దీంతో 57 శాతం నుంచి 60 శాతం వరకు మాత్రమే బియ్యం ఇచ్చే విధంగా నిబంధనలు మార్చాలని మిల్లర్లు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో మిల్లర్లు ముందుకు రాకపోవడంతో జిల్లాలో కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ఈ పరిస్థితుల్లో పౌరసరఫరాల లక్ష్యం నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు.

జిల్లా నుంచి ఈ సారి వానాకాలం సీజన్‌లో 4.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తే 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం స్థానికంగా వినియోగించుకోగా మిగతా 3.77 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌లోకి వస్తుందని ఇందులో మిల్లర్లు 77,885 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తారని అంచనా వేశారు. మిగతా 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేయాలనే లక్ష్యంగా పెట్టుకుంది. అక్టోబరులో 25 వేల మెట్రిక్ టన్నులు, నవంబరులో 75 వేల మెట్రిక్ టన్నులు, డిసెంబరులో 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, వచ్చే జనవరిలో 50 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నా ఇంతవరకు పౌరసరఫరాల శాఖ కొను గోలు చేయలేదు. సన్నరకం ధాన్యం 34,230 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. మద్దతు ధర రూ.2300 చెల్లిస్తే అదనంగా ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వనుంది. కానీ రైతులు నేరుగా మధ్య వ్యాపారులకే అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

కేంద్రం వద్ద పడిగాపులు
కొత్త మల్లయ్య, రైతు, ఓబులాపూర్



కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నాం. పట్టించుకునే నాథుడే లేడు. ధాన్యం తడస్తుందనే భయం అవుతోంది. 20 రోజులు అవుతున్నా కొనుగోళ్లు మొదలు పెట్టలేదు. కొనుగోళ్లు ప్రారంభించకుంటే రైతులు నష్టపోతారు.

యాసంగి నారుపోసే సమయం
అజ్మీరా రేణ, జవహర్‌లాల్ తండా



యాసంగి నారుపోసే సమయం వచ్చింది. వానాకాలం వడ్లు మాత్రం తూకం పడలేదు. నెల రోజుల క్రితమే వరికోసి కేంద్రంలో కుప్పలు పోసుకున్నాం. ఇంతవరకు కొనగోళ్లు ప్రారంభించలేదు. కొనుగోళ్లు చేస్తారా? లేదా? అని అయోమయంగా ఉంది.

ధాన్యం తడిసి పోయింది...
సలేంద్రీ బాలరాజు, రైతు, పెద్దూర్



ధాన్యం కుప్పలు పోసి ఆర బెట్టినాం. 15 రోజులవుతోంది. మాయిశ్చరైజ్ వచ్చినా ధాన్యం కొను గోలు చేయడం లేదు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలి.

నెల రోజులు దాటినా తూకం లేదు
జక్కుల మహేందర్, రైతు, అనంతారం



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 32 రోజులు అవుతోంది. ఇంతవరకు తూకం వేయలేదు. కేంద్రాల్లో పందుల బెడదతో ఉంది. రోజు వడ్లను ఆరబోయడం, కుప్ప పోసుకోవడంతోనే సరిపోతోంది. ప్రైవేటు వాళ్లకు అమ్ముకుంటేనే బాగుండనిస్తోంది.

కాపాలకు కష్టం: కొంటెల్లి కళ, రైతు సుద్దాల



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి పది రోజులవుతోంది. వర్షం పడిన ప్రతీసారి కష్టమవు తోంది. కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభి స్తారో తెలియని పరిస్థితి. ధాన్యం ఆరబెట్టుకోవడానికి ఇబ్బందులవుతున్నాయి.

మొలకలు వస్తున్నాయి..
: పట్నం చిన్నలక్ష్మి ముస్తాఫానగర్



ముస్తాఫానగర్ ధాన్యం కేంద్రంలో వడ్లు కుప్పలు పోసుకున్నాం. వర్షానికి ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా తూకం వేయడం లేదు. వడ్లు పోసుకునే టార్పాలిన్‌లకు అదనపు ఖర్చవుతోంది.

తూకం కోసం ఎదురు చూపులు : మర్రి రాజు, రైతు, చందుర్తి



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి నెలరోజులవుతున్నా తూకం వేయడం లేదు. ధాన్యం తూకం కోసం ఎదురు చూస్తున్నాం. రెండు ఎకరాలు సన్నరకం, ఐదు ఎకరాలు దొడ్డురకం పండించాను. వారం రోజులు అయితే యాసంగి నారు పోయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటివరకు కొనుగోళ్లు మాత్రం జరగలేదు.

ప్రతీ కుటుంబం వివరాలు సేకరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రతీ కుటుంబం వివరాలు సేకరించాలని, నిర్దేశించిన గడువులోగా లిస్టింగ్ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో ప్రతీ కుటుంబం లిస్టింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో భాగంగా ఈ నెల 1వ నుంచి 3 వరకు హౌస్ లిస్టింగ్ కొనసాగనుందన్నారు. జిల్లాలో దాదాపు 1,95,000 కుటుంబాలు ఉన్నాయని అంచనా అన్నారు. రెండు రోజుల్లో 1.25000 కుటుంబాల లిస్టింగ్ పూర్తి అయ్యిందని అదనపు కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, సీపీవో శ్రీనివాసాచారి, ఎస్డీసీ రాధాభాయ్, డీఆర్డీవో శేషాద్రి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేశ్

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేను తహసీల్దార్ సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ముస్తాబాద్‌తో పాటు పలు గ్రామాల్లో సామాజిక ఆర్థిక , విద్య ఉపాధి, రాజకీయ కుల సర్వేలో భాగంగా బ్లాక్‌లో ఉన్న కుటుంబ సభ్యులను గుర్తించడం వంటి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్ పరశరామ్‌గౌడ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ మారుతి రెడ్డి అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో అధికారులు ఇంటింటా నిర్వహిస్తున్న సర్వేను శనివారం ఆయన తనిఖీ చేశారు. ప్రతీ కుటుంబ యజమాని వివరాలను కాగితంపై నమోదు చేసి ప్రతి ఇంటికి అతికించాలన్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ ప్రవీణ్ ఉన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి



పాఠశాలలో మాట్లాడుతున్న పత్తిపాక మోహన్

సిరిసిల్ల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుల్లో రాణించడంతోపాటు సైన్స్ పరికరాల తయారీలపై మక్కువ పెంచుకోవాలని నేషనల్ బుక్ ట్రస్ట్ అఫ్ ఇండియా అసిస్టెంట్ ఎడిటర్ డాక్టర్ పత్తిపాక మోహన్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అటల్ టింకరింగ్ ల్యాబ్ సూపర్‌ఫీస్ట్-2024 వర్క్‌షాప్‌ను సైన్స్ ఉపాధ్యాయుడు పాకాల శంకర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి వర్క్‌షాప్ ఎంతో దోహదపడుతుందన్నారు. అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ డిపార్మెంట్ అధ్యాపకులు విష్ణు, ప్రధానోపాధ్యాయుడు మోతిలాల్, స్టాఫ్ కార్యదర్శి కుమ్మరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కుల గణన విధుల కేటాయింపు సరికాదు

ముస్తాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుల గణన విధులు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే కేటాయించడం సరికాదని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో టీఆర్‌టీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన విధులు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే కేటాయించడాన్ని ఖండిస్తున్నామన్నారు. అన్ని పాఠశాలల్లో అధికంగా ఉన్న ఉపాధ్యాయులను గుర్తించి విధులు కేటాయించా లన్నారు. జిల్లా కార్యదర్శి బోయన్నగారి నారాయణ, మండల అధ్యక్షుడు ఒరగంటి భాస్కచారి తదితరులు పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు

సిరిసిల్ల రూరల్, నవంబరు 2 (అంధ్రజ్యోతి) : ఈ నెల 19, 20 వ తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూషం రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లో అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో శనివారం పార్టీ జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీవైనగర్‌లోని షాదీఖానాలో మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, విమల, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేష్, సిరిమల్ల సత్యం, బింగిసంపత్, గడ్డం రాజశేఖర్; జిందం కమలాకర్ పాల్గొన్నారు.

వేములవాడ యువకుడికి యంగ్ ఏషియన్ సైంటిస్ట్ ఫెలోషిప్

వేములవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణానికి చెందిన యువ శాస్త్రవేత్త గంజి మహిపాల్ రెడ్డికి యంగ్ ఏషియన్ సైంటిస్ట్ ఫెలోషిప్ 2024 అవార్డు లభించింది. బెంగుళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సంస్థలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న గంజి మహిపాల్ రెడ్డిని హాంకాంగ్‌లోని ఏషియన్ యంగ్ సైంటిస్ట్ ఫెలోషిప్, హాంకాంగ్ అకాడమీ ఆఫ్ సైన్స్, ది యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్ సంస్థలు సంయుక్తంగా హాంకాంగ్ నగరంలో ఫ్యూచర్ సైన్స్ ప్రైజ్ వీక్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వార్షిక కాన్ఫరెన్స్‌లో అవార్డును ప్రదానం చేశారు. మహిపాల్ రెడ్డికి అవార్డు రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



మహిపాల్ రెడ్డి

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన పాముల పావని ఎంబీబీఎస్ సీటు సాధించడంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్‌కె సాబేర బేగం హర్షం వ్యక్తం చేస్తూ శనివారం విద్యార్థినిని సన్మానించారు. గ్రామానికి చెందిన పలువురు ఇప్పటికే వైద్య వృత్తిలో కొనసాగుతున్నారని, మరి కొంతమంది సీట్లు సాధించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మాజీ సర్పంచ్ నిమ్మ లక్ష్మీనారాయణరెడ్డి, గౌడ సంఘం అధ్యక్షులు లింగాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇల్లంతకుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో బాధిత కుటుంబాలను రాష్ట్ర ఆహారభద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ శనివారం పరామర్శించారు. ఇల్లంతకుంటకు చెందిన నయిమా, దుర్వేటి లింగవ్వ, వంతడుపుల గ్రామానికి చెందిన చంద్రయ్య వివిధ కారణాలతో మరణించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, రాజశేఖర్, బాలయ్య, బాలకిషన్‌రావు, మామిడి నారాయణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ముస్తాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) తడిపొడి చెత్త, పరిసరాల పరిశుభ్రతపై సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో ముస్తాబాద్ మండలంలోని ఆవునూర్ గ్రామంలో శనివారం అవగాహన కల్పించారు. సాంస్కృతిక సారథి ఎడమల శ్రీధర్‌రెడ్డి కళా బృందం ఆధ్వర్యంలో ప్రదర్శన ఇచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు రుణమాఫీ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సారంగాపూర్, నవంబరు, 2 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 3,4, 5 తేదీల్లో కామా రెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ మైత్రి. అర్చన ఎంపికైనట్లు పాఠశాల పీడీ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో కిషోర్, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్మికుల జీవితాలతో చెలగాటం

తంగళ్లపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) కార్మికుల శాశ్వత ఉపాధి కల్పన కోసం ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కులో యజమానులు తరచూ పరిశ్రమలను మూసివేసి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని సీఐటీయూ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మండిపడ్డారు. శనివారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కు గేటు ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు స్పందించి టెక్స్‌టైల్ పార్కులో పూర్తిస్థాయిలో పరిశ్రమలను ప్రారంభించి నిరంతరం ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్దాస్ గణేష్, టెక్స్‌టైల్ పార్క పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కూచన శంకర్, ఆడెపు శుభశేఖర్, దూస రాజమల్లు, ఆడేపు రవి, సంపత్, శ్రీనివాస్, ఆంజనేయులు, వరప్రసాద్, రంగయ్య, ప్రభాకర్, సత్యనారాయణ, ఆంజనేయులు, రమేష్, అశోక్, రాజు పాల్గొన్నారు.



పార్కు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జాతీయ రహదారుల నిర్మాణంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిట్లపురాణం పక్కనపెట్టి జాతీయ రహదారుల నిర్మాణంపై దృష్టి సారించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కోరారు. శనివారం సిరిసిల్లలో తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏపీ విభజన చట్టంలో తెలంగాణ ప్రాంతంలో రైల్వే లైన్‌లు, యూనివర్సిటీ, జాతీయ రహదారుల విస్తరణ వంటివి పొందు పరిచినట్లు చెప్పారు. జాతీయ రహదారుల్లో 365బీ సూర్యాపేట, జనగాం మీదుగా దుద్దెడ వరకు పనులు చివరి దశకు వచ్చాయని, అక్కడి నుంచి జాతీయ రహదారి సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు రాబోతోందన్నారు. ఈ రహదారిని వేములవాడ, కథలాపూర్ మీదుగా కోరుట్ల వరకు పొడిగించే విధంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్ ప్రయత్నం చేయాలన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే ప్రతిపాదనలు పంపించామని, చివరి దశలో ఉన్నందున అనుమతి పొందే దిశగా ప్రయత్నం చేయాలని అన్నారు. జాతీయ రహదారులు ఊరు బయట నుంచే ఉంటాయని, సిరిసిల్లలో పట్టణంలోకి రావడంతో మధ్య తరగతి కుటుంబాల స్థలాలకు ఇబ్బంది కలుగుతుందని అన్నారు. మానేరు వాగుపైన రోడ్డుకమ్ రైల్వే బ్రిడ్జి నిర్మించాలని దానికోసం ఊరి బయటి నుంచి రహదారులు వెళ్లేలా చూడాలన్నారు. టెండర్లు డీపీఆర్ దశలోనే ఉన్నందుకు 1.8 కిలోమీటర్ల మేరకు మార్పులు చేయాలన్నారు. రైల్వే ట్రాక్ వెంట రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఇప్పటికే కరీంనగర్ నుంచి ఒక రహదారి, సిరిసిల్ల నుంచి కామారెడ్డి మీదుగా మరో రహదారి నిర్మాణం జరుగుతున్న క్రమంలో పరిహారం, తమ హక్కులను సాధించుకోవాలి కానీ ఎవరూ రహదారులు అడ్డుకోవద్దని సూచించారు. సిరిసిల్ల నుంచి కోరుట్ల వరకు రహదారి పొడిగించకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, మ్యాన రవి, మనోహర్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, దార్నం లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సుభాష్, మల్లారెడ్డి, మానస తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరులో సాహితీ సమాలోచన సదస్సు

సిరిసిల్ల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబరులో డాక్టర్ నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం సాహిత్య సమాలోచన సదస్సు నిర్వహించాలని మానేరు రచయితల సంఘం నిర్ణయించిందని మారసం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పత్తిపాక మోహన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి తెలిపారు. సిరిసిల్ల డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మానేరు రచయితల సంఘం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించేందుకు సిద్ధం చేసిందని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో నిర్వహించేందుకు అనుమతులు ఇవ్వాలంటూ శనివారం కవులు, రచయితలు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ కోరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న కవులు, రచయితలు

ఎంపీ నిధులతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు



సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

సిరిసిల్ల రూరల్, నవంబరు 2 (అంధ్రజ్యోతి) : కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజల సంక్షేమం కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్‌కుమార్ ఎంపీ నిధులను వినియోగించారని, ఈ విషయాన్ని మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ తెలుసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి చేయడం లేదని వినోద్‌కుమార్ వ్యాఖ్యలు సరికాదన్నారు. కరీంనగర్ పార్లమెంట్‌పరిధిలో దాదాపు రూ.20 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, చందుర్తి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు అసాని రాంలింగారెడ్డి, జిందం సంతోష్, సిరిసిల్ల వంశీ, జూకంటి అఖిల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: ప్రజలు తమను పూర్తిగా మరిచిపోతున్నారని ఆవేదనతోనే మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ పూర్తి అవగాహన లోపం కారణంగానే తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని, ఐదు సంవత్సరాల పాటు ఎంపీగా పదవిలో ఉండి ఈ ప్రాంత అభివృద్ధిని విస్మరించిన బోయినపల్లి వినోద్ కుమార్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్‌ని విమర్శించే అర్హత లేదని వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు అన్నారు. శనివారం ఆయన వేములవాడలో విలేకరులతో మాట్లాడారు. బోయినపల్లి వినోద్ కుమార్ సిరిసిల్లలో విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చిన సమయంలో కేసీఆర్ ప్రధానమంత్రిని కలవలేదని గుర్తు చేశారు. అయినప్పటికీ తెలంగాణ అభివృద్ధికి సహకరించిన కేంద్రాన్ని బదనాం చేసేందుకు ప్రయత్నించడం ఆయన అవగాహన లోపానికి నిదర్శనమన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, బండి సంజయ్ నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారని, బండి సంజయ్ పనితీరు మెచ్చుకుని ప్రధానమంత్రి మోదీ ఆయనను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమించారని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని, యువతకు ఉపాధి కల్పించే అంశాలను తుంగలో తొక్కిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి గత ఎన్నికలలో ప్రజలు గట్టి బుద్ధి చెప్పారన్నారు. బయటకు విమర్శలు చేసుకుంటున్నా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనని ప్రజలు గుర్తిస్తున్నారని, బీజేపీపై తప్పుడు విమర్శలు చేస్తే ప్రజలు సహించబోరని హెచ్చరించారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు దులేపాషా, నామాల శేఖర్, నేరెళ్ల సాయి, రేగుల శ్రీకాంత్, సగ్గు రాహుల్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై చేసినటువంటి వ్యాఖ్యలు హాస్యాస్పదమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన చందుర్తిలో విలేకర్లతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు తెలంగాణ యువతను మత్తుకు బానిసలు చేసిందన్నారు.

గంభీరావుపేట: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై విమర్శలు మానుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్ అన్నారు. గంభీరావుపేటలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీగా ఉన్న సమయంలో వినోద్‌కుమార్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని స్వయంగా సిరిసిల్ల సమావేశంలో ఒప్పుకున్నారన్నారు.



వేములవాడలో మాట్లాడుతున్న సంతోష్ బాబు